# గర్ల్ ఫ్రెండ్!

–అవసరాల రామకృష్ణారావు

"ఏమండోయ్ అవధానిగారూ, నిన్నటి రోజున మీ గర్ల్ ఫ్రెండ్ ఏమందిట?"

అంటూ నా మార్నింగ్ వాక్ సహచరులు రోజూ నన్ను పలకరించడం మామూలైపోయింది. నాతో తిరగడానికి వచ్చే ఆ నలుగురు మా వీధివాళ్ళకి మా ఇద్దరి అనుబంధం అర్థమయే అవకాశం ఎలాగా లేదు. అదో జోకు అనుకుని అలా అడుగుతారు గాని జవాబు వినే ఓపిక కూడా వాళ్ళకి లేదు! నడుస్తున్నప్పుడు వాళ్ళ నోటంట వచ్చే సంగతులెప్పుడూ ఇంక్రిమెంట్సూ, ఎరియర్సూ, ఓవర్‌టైమూ, ఎర్న్‌డ్ లీవూ – ఇలాంటి వాటి చుట్టూనే తిరుగుతాయి. అతి ముఖ్యమే కావొచ్చు గాని ఆర్థికం ఒక్కటే పారమార్థికం కాలేదు కదా! ఏ రోజుకారోజు వెన్నెలా వెలుతురూ కలిపి పంచి పెట్టే మా పక్కింటి సుబ్బాయమ్మ గారి గురించి వాళ్ళకేం చెబితే అర్థమౌతుంది!

అటూ ఇటూగా నలభై అయిదుకి చేరుకుంటున్న మా సగటు వయసు ఓ పక్కకి నెడితే సుబ్బాయమ్మగారి వయసెంతో తెలుసునా, అరవై ఎనిమిది! ఇంతకీ 'ఏమండోయ్, పక్కింటి పిన్నిగారికి మీతో ఏదో పనుందిట, అరగంటై వచ్చి కూచున్నారు' అని మా ఆవిడే చేసిన తొలి పరిచయం నాడే నేనావిడ వైపు కన్నెత్తి చూడ్డం! 'చూడు బాబూ, అమ్మాయి చెప్పింది నీకు యూనివర్సిటీలో పనిటగా, కాస్త వచ్చేటప్పుడు ఓల్గా గారి 'రాజకీయ కథలు' తెచ్చిపెడతావా?' అందావిడ. మా ఆవిడతో కలిగిన అనుభవంతో ఆడాళ్ళ రీడబిలిటీ మీద అతి తక్కువ అభిప్రాయం ఏర్పరచుకున్న నేను ఓ తలనెరసిన పెద్దావిడ, పుస్తకాల పురుగని పేరు తెచ్చుకున్న నేను – నేనే కనీవినీ ఎరగని ఓ పుస్తకం పేరు ఉదహరిస్తే తెల్లబోక చావనా!

అది మొదలు, అలా నా చేత ఎన్ని పుస్తకాలు తెప్పించుకుందో! తెలుగేకాక ఇంగ్లీషు పుస్తకాలూ సరఫరా చేసే నాకా పేర్లతో అయినా పరిచయం లేదు. అవన్నీ చూస్తుంటే ఆ వయసులో రోజురోజుకి పెరిగే ఆ విజ్ఞాన తృష్ణ చూస్తూంటే ఉన్న మతిపోదా! క్రమక్రమంగా ఆవిడకి సంబంధించిన విషయాలన్నీ ఆరా తీయజొచ్చింది నా మనసు.

సుబ్బాయమ్మగారు ఆ రోజుల్లోనే తెలుగు బియ్యే పాసయిందట. ఇంకా చదువుకుంటానని ఎన్ని విధాలుగా పేచీపెట్టినా వాళ్ళ వాళ్ళు ఒప్పుకోక పెళ్ళిచేసి కాపరానికి పంపేశారుట. ఇంతకీ ఆ ముచ్చట ఎన్నాళ్ళు? నాలుగేళ్ళ కొడుకుతో, వితంతువుగా ఇల్లు చేరే వరకూను.

ఇంకా వెనక్కి వెళ్ళాలంటే వాళ్ళదో పండిత వంశం. తాతగారు పరమనిష్ఠాగరిష్ఠుడు. తండ్రి ఆరేళ్ళపాటు అండర్ గ్రౌండ్‌లో కట్టుబడిన కమ్యూనిష్టు. మొగుడూ తక్కువవాడు కాదు, ఎమర్జన్సీలో ఆహుతైపోయిన రివల్యూషనిష్టు! ఇక సుబ్బాయమ్మగారి ఏకైక పుత్రరత్నం తాలూకు వర్తమాన వైనం? పెళ్ళాంతో సహా ఏదో ఓ ప్రసిద్ధ వ్యాపార సీమలో విదేశంలో స్థిరపడిన మేధావి! ఆ ప్రాంతాల్లో అనుకున్న చదువులకి అవకాశం లేక మనవడు మోహన్‌ని పెట్టుకుని సుబ్బాయమ్మగారు మనదేశంలోనే ఉంటోంది. వాడు ఇంటరు ఫస్టియరు చదువుతున్న మా శీను క్లాస్మేటని తర్వాత తెలిసింది!

అంతో ఇంతో ఇలాంటి నేపథ్యం ఎవరి జీవితంలోనైనా ఉండొచ్చుగాని, జీవితంలోని ఏ అసంతృప్తి అయినా పైకి ప్రకటించని ఆవిడ వాగ్ధోరణి చూస్తే మాత్రం వింతగా ఉండేది నాకు. నాలోని మొహమాటం, సంకోచం యిలాంటి వెనుకబడిన లక్షణాలన్నిటినీ నిమిషాలమీద ఎగరగొట్టేసింది ఆవిడ. మార్నింగ్ వాక్‌తోపాటు తిరిగొస్తూ ఆవిడ దగ్గర కూచుని ఆ వార్నింగ్ 'వాక్కు' వినకపోతే ఆ రోజంతా ఏదే వెల్తిగా ఉంటుందిప్పుడు నాకు.

ఓ గోడ మాత్రమే అడ్డంగా ఉన్న మా ఆవిడ రత్నం సంగతే చెప్పవలసి వస్తే దీనికి 'ఊపిరి తీసుకోడానికైనా క్షణం తీరిక ఉండదు!'. ఇక అటు పొలం వ్యవహారాలనీ ఇటు ఇంటి అద్దెల వసూళ్ళనీ ఏకచేతిన లాగిస్తూ, వంటమనిషి మాట దేవుడెరుగు, దాసిని అయినా పెట్టుకోక తనే అన్నీ చేసుకుంటూ, వచ్చిన ప్రతి పేపరుతోపాటు ఉద్గ్రంథాలూ ఆమూలాగ్రం తిరగేసే సుబ్బాయమ్మగారికి మాత్రం 'ఎప్పుడూ తీరికే!'

ఆనాడే శంకరాచార్యుడు చెప్పిన ఓ మాంచి భజగోవింద శ్లోకాన్ని కాస్త మార్చి ఆవిడే తెలిగించిన తీరు చూడండిః

బాలుడికయితే ఆటల రంధీ
పడుచు వాడికీ పాటల గంధీ
ముసిలి ప్రాణికీ బాదరబందీ
మిగిలిన వాటికి టైమెక్కడుందీ?

నీతులు బోధించడానికి, వాటిని ఆచరించడానికి శతకోటి యోజనాల దూరం ఉండొచ్చు. సుబ్బాయమ్మ గారి విషయంలో మాత్రం ఆ దూరం అణుమాత్రం లేదుగనుకనే ఆవిడకంత తీరిక!

అయిదింటి నుంచి ఆరింటి దాకా దగ్గర్లో ఉన్న పోర్టు స్టేడియంలో తిరిగి రావడం మాకు అలవాటు. టీవీలో ఎలాంటి ఘోరమైన ప్రసారాలు వస్తున్నా, జరిగే మేలు కూడా తగుమాత్రం లేకపోలేదు కాబట్టి దాన్ని చూసే పిల్లల్లో కొంతమందికైనా శరీర దారుఢ్య స్పృహ ఇటీవల పెరిగినట్టుంది. దానికి ప్రత్యక్ష సాక్ష్యం మా శీనుగాడూ, సుబ్బాయమ్మగారి మనవడు మోహనూ రోజూ తప్పనిసరిగా తెల్లారుఝామున మాక్కాస్త ముందో వెనకో రన్నింగ్‌లో పాల్గోడమే. మనవడికి సంబంధించిన ఓ చిన్న విషయం సుబ్బాయమ్మగారి సూక్ష్మదృష్టికి ఎలా దొరికిపోయిందో చెప్పడానికే ఇదంతా మీ ముందుకి తేవడం.

అంతకుముందు ఆదరాబాదరా లేస్తూనే మార్నింగ్ వాక్‌కి బయలుదేరేవాణ్ణి. ఇప్పుడు యీవిడ పరిచయం వల్ల కాలకృత్యాలు తీర్చుకుని మొహం కడుక్కుని మరీ బయటపడుతున్నా. ఎందుకంటే తిరిగి వచ్చేవేళకి ఫ్లాస్కు దగ్గిర పెట్టుకుని ఆవిడ సిద్ధం. నాకో కప్పు కాఫీ యిచ్చి ఆవిడా, అప్పటికే రెండోమాటుట, కాఫీ తాగుతూ ఉంటుంది. ఎంతో ఘాటుగా, రుచిగా ఉంటుంది ఆవిడ చేసిన కాఫీ. అయితే దాని గొప్ప గొంతుక దిగేంతవరకే. ఆ ప్రసంగ సారం మాత్రం రోజంతా నాకు తేనుపుకి వస్తూనే ఉంటుంది. నాలాంటి శ్రోత దొరికాదుగదా అని అది అంతులేని మోత అనుకునేరు. 'అవధానీ, అయిదున్నర అయిపోయింది, ఇక నువ్వు వెళిపో' అన్నంత స్పష్టంగా చెబుతుంది.

మోహన్ అమ్మానాన్న అక్కడ వీడికోసం ఎన్నికోట్లు కూడబెడుతున్నారో నాకు తెలీదుగాని ఇక్కడ బామ్మగారి ఆధ్వర్యంలో మాత్రం వాడి సర్వతోముఖాభివృద్ధికి ఏమాత్రం తూట్లు పడకుండా వెయ్యికళ్ళతో చూసుకోడం జరుగుతోంది. "మా అబ్బాయీ కోడలూ నన్ను నమ్మి పిల్లాణ్ణి నాకప్పజెప్పేరు. దేశాన్నీ సంఘాన్నీ ఉద్ధరించే వెర్రిభ్రమ నా కెలాగూ లేదు. వీడికైనా మంచి దారి చూపించొద్దా?" అంటుంది ఆవిడ. అమ్మ హృదయం ఉన్న ఏ ఆడదయినా కడుపు తడిమి అన్నం పెడుతుంది. అంతటితో ఆగితే సుబ్బాయమ్మగారి గురించి చెప్పుకోడమెందుకు, మనసుకి మాలిన్యం అంటుకోకుండా వాణ్ణి సరిదిద్దాలని ఆమె ప్రయత్నం. మాధ్యమాల ధర్మమా అని వ్యాపార సంస్కృతికి పట్టం కడుతున్న ప్రకటనా మాయ ప్రభావం నుంచి రక్షించి, నేటి కుర్రాళ్ళకో నీతి బాట చూపించడం అంత సులువా! సంస్కృతీ

సాంప్రదాయం అనే పెద్ద కబుర్లు పక్కనబెడితే మనుషులందరి మంచికీ అవసరమయే ప్రాథమిక సూత్రాలంటూ ఉంటాయి కద! 'కష్టపడితేనే మంచి ఫలితం దక్కుతుంది' అనేది పాత చింతకాయ పచ్చడైపోయి 'నలుగురిని కొట్టయినా ఇల్లు నింపుకో, సుఖపడతావు' అనే మాట చెప్పకుండానే పిల్లల మనసులో నాటుకుపోతూంటే ఏ మొహం పెట్టుకుని వాళ్ళకి చెబుతాం! ఏ పేపరు తిరగేసినా ఏ టీవీ 'నొక్క' బలికినా ఏం తెలుస్తుంది? ఒకటి కొంటే మరొకటి ఫ్రీ.. ఒక్క లాటరీ టిక్కట్టు కొన్నావో వొళ్ళంతా జవహరీ... గోరంత పెట్టుబడితో కొండంత రాలుబడి... ఉచితం, పూర్తిగా ఉచితం... ఒకటి కొనండి, పది సర్‌ప్రైజులు అందుకొనండి నర్!... ఇలాంటి దినదిన ప్రవర్ధమానమౌతున్న విష సంస్కృతికి సంఘం ఆమోదముద్ర ఉంది. ప్రభుత్వం ప్రోత్సాహం ఉంది. ఎందుకంటే ఇవి బతకడానికి ఆయువుపట్టు అవినీతి మాత్రమే గనక...

అలజడి కలిగించే, ఆలోచన రగిలించే, ఆంతర్యాన్ని వెలిగించే సుబ్బాయమ్మగారి ఇలాంటి వ్యాఖ్యలు నన్నో కుదుపు కుదిపి మా శీను విషయంలో నా బాధ్యతని మరింత పెంచాయంటే అందులో ఆశ్చర్యమేముంది! ఇలా రాసుకుపోతే ఇదావిడ ప్రశంసాపత్రంగా మిగిలి మీరింతటితో చదవడం ఆపేసే ప్రమాదముంది! విసిగిస్తే మన్నించి అసలు విషయానికి వస్తున్నాను. అవధరించండి..




మేం మార్నింగ్ వాక్‌కి వెళ్ళొచ్చే మార్గంలోనూ, అంతకు ముందే లేచి ఏదో పాడుకుంటూ వీధి గుమ్మాన్ని కళ్ళాపి వేసి అటూ యిటూ సుబ్బాయమ్మగారు దృష్టి సారించే వ్యవహారంలోనూ, మేం తప్పనిసరిగా గుర్తించే విషయం ఒకటుంది. మరో జీవన మార్గంలేక, ఇంతింత కుర్రాళ్ళతో అంతంత పెద్దాళ్ళతో సహా, దుర్గంధపూరితమైన డస్ట్‌బిన్‌లు కెలికి, విరిగిన ప్లాస్టిక్ ముక్కలూ, కాగితాలూ సేకరించే దృశ్యం. అదో జీవన విధానం గనక శ్రమపూరితం గనక హృదయం అంటూ ఉంటే సానుభూతి తప్ప మరొకటి ఉండదు. ఇక రెండోది ఏ తర్కంతో ఆలోచించినా సమస్త మానవాళీ సిగ్గుతో తలవంచుకునే దృశ్యం. ఏ ఎదురింటి గోడ మీంచి పైకి చూస్తున్నవో, పక్కింటి ప్రహరీ నుంచి ఇవతలికొచ్చినవో పువ్వులు దొంగలించడం. ఏ యినప ఊచతోనో కొమ్మలు విరిగిపోయేలా వంచి మనవికాని పుష్పజాతిని చల్లగా సంగ్రహించడం. "ఏ రేక నందివర్ధనమో చిన్న కుండీలో వేసుకుని రోజూ నీళ్ళు పోస్తే విరగబూస్తుంది. దానికి మాత్రం ఒళ్ళొంగదు. పాచి మొహంతో దొంగ పువ్వులు కోసి అర్పిస్తే గాని ఆ నవనీతచోరుడు అనుగ్రహించడేమో!" అనేది సుబ్బాయమ్మ గారి వ్యాఖ్య.


చెప్పడం మరచిపోయాను, ఇంటి పెరట్లో ఆవిడ పూయించని పువ్వంటూ లేదు. మనవడు మోహన్‌కి కూడా మొక్కలంటే గొప్ప సరదా. ఎక్కడెక్కడి కొత్త రకాలూ తెచ్చి నాటడం కాక – డాబా మీద గులాబీ రకాలు వాడికి గర్వకారణం. తమాషా ఏమిటంటే యిలాంటి సందర్భంలోనే వాళ్లిద్దరి మధ్యా నేను మొదట్లో గుర్తించని ఓ విశేషం జరిగింది.

మరేం లేదు. ఆరోజు బాగా మబ్బుగా ఉన్నట్టుంటే గొడుగేసుకుని మార్నింగ్ వాక్‌కి బయల్దేరదామని దానికోసం చూశా. అది కనపడలేదు. ఇంకేముంది, మా శీనూ వాళ్ళ మోహనూ మా కంటె ముందుగానే బయల్దేరుతున్నారు కదా, వాడే తీసికెళ్ళి ఉంటాడని సరిగ్గానే ఊహించాను.

ఇంతకీ మా విశాఖపట్నం వాతావరణం గురించి మీరు వినే ఉంటారు. 'ఉక్కు' నగరం కాని ఇది ఉక్కు నగరం కాదు. చెమట వర్షం తప్ప ఇక్కడ వాన చినుకు అరుదు. వచ్చే వానని కొండలు అడ్డేస్తున్నాయనీ, వాటికి కిటికీలు లాంటివి కొట్టిస్తే గాని ఆ జల్లు ఇటు మళ్ళదనీ

## పెట్టుబడి 25 డాలర్లు - లాభం 3,57,575 డాలర్లు

శ్రీమతి వాండాబెల్ తరచు ఆర్ట్ షాపులకి వెళ్తుంటుంది. ఓసారి ఆమె ఓ బ్లాక్ అండ్ వైట్ ప్రింట్‌ని అక్కడ 25 డాలర్లకి కొన్నది. ఇంటికొచ్చాక చూస్తే ఆ ప్రింట్ కింద ఉండే పేనెల్ మీద చిత్రీకరించిన ఓ మధ్య వయస్కుడి చిత్రం కనిపించింది. దాన్ని ఆమె ముందు గదిలో తగిలించి "అంకుల్ జార్జ్" అనే పేరు పెట్టింది. ఓ ఆర్ట్ లవర్ ఆమె ఇంటికొచ్చి నపుడు దాన్ని చూసి 800 డాలర్లకి కొంటానన్నాడు. 25 డాలర్లకి 800 డాలర్లు వచ్చేది తను కొన్నందుకే సంతోషపడ్డ వాండా కష్టకాలంలో కాని తాను దాన్ని అమ్మనని చెప్పింది. అలా 8 ఏళ్ళు గడిచాయి. ఓ టి.వి.లో 'బబ్స్ ఏంటిక్స్ రోడ్ షో' అనే కార్యక్రమం మొదలయింది. ఏ వూరికి పాత వస్తువులని చూసి వాటికి ధరని నిర్ణయించే వాళ్ళు వస్తారో ముందే ఆ కార్యక్రమంలో ప్రకటించి ఆసక్తి వున్న వారు కలవమని చెప్తుంటారు. ఆ విధంగా తమ వూరుకి వచ్చినపుడు వాండా 'అంకుల్ జార్జ్' చిత్రాన్ని వాళ్ళ దగ్గరకి తీసుకెళ్ళింది. దాన్ని చూసిన వాళ్ళ మొహం వికసించింది. అది 1820లో ఇంగ్లండ్ ఆర్టిస్ట్ షెల్డన్ పెక్ వేసిన చిత్రమని, పొప్లర్ వుడా పేనల్ మీద గీసిన ఆ చిత్రం ఒకరు 3,50,000 డాలర్లకి తగ్గదని చెప్పారు. వాండాబెల్ ఆనందానికి అంతేలేదు. ఆ చిత్రం 'సూత్ బేస్' అనే ప్రముఖ ఆర్ట్ ఆక్షన్ హాల్‌కి పంపింది వాండా. 3,57,600 డాలర్లకి అది అమ్ముడైంది. తను కేవలం ఫ్రేమ్‌ని చూసి అది నచ్చి అందులో వున్న బ్లాక్ అండ్ వైట్ ప్రింట్‌ని కొనడం గుర్తుకు తెచ్చుకుంది వాండా. తనకంత లాభాన్ని చేకూర్చిన ఆ ఫ్రేమ్‌ని ఆమె ఇంట్లో ఎంతో ఆరాధనతో ఏ బొమ్మా వుంచకుండా ఖాళీగా వేలాడదీసింది.



-డి. పద్మజ

కొందరు శాస్త్రజ్ఞుల అంచనా కరెక్టే అయి ఉండాలి మరి. అది జరిగే వ్యవహారమూ కాదు!

ఏది ఏమైనా ఆరోజు గొడుగుమోత లేకపోవడం నాకు మంచిదే అయింది. మాయదారి మబ్బు ఒక్క చినుకు విదల్చలేదు!

ఆ ఉదయం మా అరగంట సంభాషణలో ఇదే విషయాన్ని ఆవిడ పదే పదే ప్రస్తావించడం నాకు ఆశ్చర్యమనిపించింది.

కాఫీ కప్పు చేతికందిస్తూ అడిగింది సుబ్బాయమ్మ గారు.

'చూడు అవధానీ, ఈ పొద్దుటిపూట ఈ ప్రాంతాలలో మాత్రం చినుకన్నది పడలేదు. అక్కడ స్టేడియమ్‌లో మాత్రం అంతో ఇంతో పడే ఉంటుంది. లేపోతే గొడుగులు పట్టిగెడతారా ఏం?'

'అలాంటిదేం లేదే, ఎందుకలా అడిగారు?'

అన్నాను తెల్లబోయి. చెప్పేనుకదా మా శీను నా గొడుకు తీసికెళ్ళాడని. ఆ ఉదయం వాళ్ళ మోహన్ కూడా వాళ్ళ గొడుగు తీసికెళ్ళినట్టున్నాడు. తెచ్చి పెట్టేసి ఉంటాడు. అసలే వాళ్లు రన్నింగ్ కూడా చేస్తారు. కూడా ఈ గొడుగుల అదనపు బరువు బాగా ఇబ్బంది కూడాను.

మా కబుర్లింకా పూర్తవకుండానే వాళ్ళ మోహన్ యూనిఫాంతో, బరువైన పుస్తకాల సంచితో చెమటలు కక్కుకుంటూ మా ముందు నుంచే వెళ్ళిపోయాడు. అంత పొద్దున్నే బయల్దేరి ఎంతో చీకటి పడ్డాక గాని ఇల్లు చేరడం కుదరని - మనందరం బాధ్యత కాదనలేని - టీనేజీ డామేజీ అది!

'చిత్రంగా ఉందయ్యా! నేనెంత గోల పెట్టినా మా బుజ్జి గొడుగు పట్టుకెళ్ళడు. సరే అని ఎక్కడో పెట్టేశాను. అంత పొద్దున్నే బ్యాటరీ లైటు వేసుకుని వెతికి మరీ దాన్ని తీసికెళ్ళాడు. వస్తూనే ఆ ముడిచిన గొడుగుని నీళ్ళు పోసి కడిగేదయ్యా! అది కూడా పైన కాదు, లోపల! నేను స్నానం చేసి వచ్చేసరికి ఇదంతా జరిగిపోయింది. ఎందుకిలా జరిగిందని!'

పుస్తకాలూ, దేశంలో వస్తున్న మార్పులూ ఇలాంటి వాటి గురించి తప్ప నోరు విప్పని సుబ్బాయమ్మగారు ఇవాళ మనవడి గొడుగు అట్టడుగు భోగట్టాలు ఆరా తీస్తోందేం చిత్రం! వానపడితే ఏం, లేకపోతే ఏం; గొడుగు ఎక్కడ తడిస్తే ఏమైందిట! అక్కడితో ఊరుకోక ఆవిడ నన్ను లోపలికి లాక్కెళ్ళి మనవడి నిర్వాకం చూపించింది. కాలేజీ ప్రైవేటు దరువుకి పరిగెత్తే హడావిడిలో వాడు గొడుగుని విప్పినట్టయినా లేదు. ఓ మూలకి చేరేశాడు. ఆవిడ చెప్పినట్టు లోపలివైపు నీళ్ళుపోసి కడిగినట్టు తెలిసిపోతూనే ఉంది.

"మీ శీనుని అడిగి రావొచ్చుగాని వాడూ మా బుజ్జిగాడి తోడిదొంగ కదా, ఈపాటి కిద్దరూ సిటీబస్సు ఎక్కేసి ఉంటారు. ఇంతకీ ఏం జరిగి ఉంటుందో ఊహించలేకకాదు, రుజువు కోసం చూస్తున్నా. సరేగాని అవధానీ, నా కుడివైపు కాస్త ఆసరా ఇస్తావా, ఒక్కసారి డాబా ఎక్కిరావాలి. దిక్కుమాలిన మెట్లు బాగా ఇరుకు కదా!"

చెయ్యి సాయం అందించి ఆవిణ్ణి పైకి చేర్చాను. ఎంత క్రమశిక్షణతో బతికినా ఏ వయసుకి ఆ సలుపు తప్పదు కదా!

అక్కడ వరసగా ఓ అరడజను గులాబీ కుండీలు ఆ శుభోదయంలో మాకు స్వాగతం పలుకుతున్నాయి. మోహన్‌గాడి హాబీ చూస్తే ఎంతో సరదా వేసింది నాకు. ఇరవై నాలుగ్గంటలు చాలని కాలేజీ చదువు వెలిగిస్తూ, పొద్దుట ఎక్సర్‌సైజు చేస్తూ, కింద నుంచి నీళ్ళు మోసుకొచ్చి పైకి పోస్తూ, ఇలాంటివి పూయించడానికి ఎంత ఓపిక కావాలి!

"కిందనైతే ఎంతటి పనైనా చక్కబెట్టుకు రాగలరు మీరు. పైకి మాత్రం రాలేని మోకాళ్ళ నొప్పులు మీకు. అయినా మోహన్ ఎంత బాగా పెంచుకొస్తున్నాడో చూశారా! మీ మనవడి ప్రయోజకత్వానికి మీరు సంతోషించాలి!" అన్నాను ఊరుకోలేక.

"ప్రయోజకత్వం అనేది కాస్త హద్దు దాటిందేమోనని చిన్న భయం పట్టుకుంది అవధానీ!" అందావిడ చటుక్కున.

ఆశ్చర్యం నుంచి ఇంకా నేను తేరుకోకుండానే ''ఇదిగో ఇటు చూడు!'' అంటూ నా దృష్టిని మళ్ళించిందావిడ.

దూరంగా ఓ కొత్త కుండీ ఉంది. దాన్లో పసుప్పచ్చ మొగ్గ ఉన్న ఓ గులాబీ మొక్క తప్పుచేసి దొరికిపోయిన ఆడపిల్ల మొహంలా, తలవాల్చి కనిపించింది!

"ఎంతగా నేను కళ్ళల్లో కళ్ళు పెట్టుకు చూసినా మా బుజ్జిగాడి బుద్ధి ఎలా వికటించిందో చూశావా! కడిగిన గొడుకుకీ ఇందులో ఒదిగిన యీ మొక్కకీ సంబంధం ఏమిటో గుర్తించావా!"

నా మట్టి బుర్రకి యింకా ఏం ఎక్కలేదు.

"వేల కొద్దీ డాలర్లు వాళ్ళ అమ్మా నాన్నా అక్కణ్ణుంచి గుప్పిస్తున్నారు. ఇక్కడ నా రాబడి సరేసరి! ఇన్నీ కలిపినా వేం వాణ్ణి ఈ కాలుష్య వాతావరణం నుంచి రక్షించలేకపోయాం. ఇవాళ వాడేం చేశాడో తెలుసా, మీ స్టేడియంలో ఎన్నో రకాల పూల మొక్కలు పెంచుతున్నారని నువ్వే ఎన్నోసార్లు చెప్పేవ్ కదా! అక్కణ్ణుంచి ఓ పచ్చ గులాబీ మొక్క దొంగలించి తెచ్చాడు. గొడుగులోపల ముడిచి గేటు దాటించాడు. వేళ్ళకున్న మట్టి పోవడానికి కాబోలు గొడుగు లోపల కడిగినట్టున్నాడు. ఇలాంటివి నేనేమాత్రం ఒప్పుకోనని, నేను బాత్రూంలో ఉండగా - నేను వెళ్ళలేననుకుని డాబా ఎక్కి దాన్నిక్కడిలా ప్రతిష్ఠించాడు!"

సిగ్గుపడుతున్నట్టున్న మొక్కని సిగపట్టుకు లాగేసింది సుబ్బాయమ్మగారు. సెంట్రీ పట్టుకోలేంది, ఈ గ్రానీ పసికట్ట గలిగింది!

"వీధిలో ముగ్గు వేయడంలోనూ, గుమ్మానికి తోరణం కట్టడంలోనూ ఉండదు, ఏ దేశ సంస్కృతి అయినా నిజాయితీగా బతకడంలోనూ, ఉచితంగా వచ్చేది ఏదైనా ఉచితం కాదని తెలుసుకోడంలోనే ఉంటుంది. రీసైక్లింగ్ చేసి ఎలాంటి వ్యర్ధపదార్థాన్నయినా ఉపయోగించుకోవచ్చు. ఊరికే వచ్చేదాన్ని తేరగా అనుభవించాలనే భావాన్ని సమూలంగా నాశనం చేస్తేగాని ఈ జాతికి పట్టిన జాడ్యం వదలదు - సరే నేనేదో ఇలా వాగుతూనే ఉంటాను. నీ కవతల పనుంటుంది. ఆరుదాటిపోతోంది. ఇక ఇంటికి దయచెయ్యి అవధానీ!" అంది సుబ్బాయమ్మగారు.

మంచి వైపు మన మనసుల్ని వంచగల - అలా ఆలోచించగల వారెవరికైనా గర్ల్ ఫ్రెండ్ అని పేరుంటే ఆవిణ్ణలా స్వీకరించడానికి నాకే అభ్యంతరంలేదు. అందుకనే సుబ్బాయ్యగారి గురించి ఏదైనా చెబుతున్నపుడు మా మార్నింగ్ వాక్ కొలీగ్స్‌తో 'నిన్నటి రోజున మా గర్ల్ ఫ్రెండ్ ఏమందంటే...' అంటూ ఈ మధ్య హాయిగా నేనే చెప్పగల్గుతున్నాను!

*